క్లుప్తంగా

చెట్టును ఢీకొట్టిన కేఎస్‌ఆర్టీసీ బస్సు

పాలసముద్రం: మండలంలోని సన్నగుంటకు వెళ్లుతున్న రోడ్డు సమీపంలో శనివారం కర్ణాటక ఆర్టీసీ బస్సు అదుపు తప్పి చెట్టుని ఢీకొట్టింటి. అదృష్టవశాత్తు అందులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని డ్రైవర్ తెలిపారు. బలిజకండ్రి నుంచి 12.30 గంటకు బెంగళూరుకు బయల్దేరిన కర్ణాటక ఆర్టీసీ బస్సు సన్నగుంట సమీపంలో ఎదురుగా ద్విచక్రవాహనం రావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చింత చెట్టును ఢీకొట్టింది. అందులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు హఠాత్తుగా చెట్టుని ఢీకొని ఆగిపోయినా ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ జేసీబీ సహాయంతో బస్సుని రోడ్డుపైకి తీసుకుని వచ్చారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న రామకృష్ణ

పుత్తూరు: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవచ్చునని బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు ఆలూరు రామకృష్ణ సూచించారు. శనివారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పూర్వ విద్యార్థులతో కలిసి ఫ్రెండ్‌షిప్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి.గోపాల్‌రెడ్డి, రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భజనలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో కార్వేటినగరం మండలం గాదంకి గ్రామానికి చెందిన శ్రీరామ డీజే బృందం శనివారం నిర్వహించిన కోలాట భజనలు ఆకట్టుకున్నాయి. కాణిపాకం దర్శనార్థం గాదంకి గ్రామం నుంచి ప్రధాన ప్రాంతాల్లో కోలాటాలు వేస్తూ స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటామని భజన భక్తులు పేర్కొన్నారు. ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా డీజే పాటలకు భజన భక్తులు వేసే కోలాటాలు అలరిస్తున్నట్లు పేర్కొన్నారు.

12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



మాట్లాడుతున్న పోలీసులు

వెదురుకుప్పం: మండలంలోని నక్కల కాలనీలో శనివారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలతో పోలీసులు కార్డన్‌సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. నగరి డీఎస్పీ మహమ్మద్ అజీజ్, కార్వేటినరగం సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో చేపట్టిన కార్డన్ సెర్చ్‌లో భాగంగా కాలనీవాసుల నుంచి 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. వాహనాలకు సంబంధించి రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. అదేవిధంగా షికారీలకు పలు అంశాలకు సంబంధించి అవగాహన కల్పించి, సూచనలు, సలహాలు అందించినట్లు చెప్పారు.

విఘ్నాలు లేకుండా చవితి వేడుకలు

నగరి: విఘ్నాలు లేకుండా వినాయక చవితి నిర్వహించుకుందామని ఆర్డీఓ అనుపమ అన్నారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై చర్చించడానికి శనివారం పట్టణ పరిధిలోని మెప్మా కార్యాలయంలో రెవెన్యూ, పోలీసులు, విద్యుత్‌శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతితో పాటు విద్యుత్‌శాఖ, అగ్నిమాపక శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. లేకుంటే విగ్రహాల ఏర్పాటుకు అనుమతించమన్నారు. ఉత్సవ కమిటీ వారు ముందస్తు జాగ్రత్తగా అన్ని అనుమతులను పొందాలన్నారు. విగ్రహాల భద్రత బాధ్యతను కూడా కమిటీ వారే స్వీకరించాల్సి ఉంటుందన్నారు. డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ మాట్లాడుతూ రోడ్డుకు అంతరాయం లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. శబ్ద కాలుష్యం ఉపయోగించకూడదని ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే లౌడ్ స్పీకర్లను వినియో గించుకోవాలన్నారు. రాత్రి వేళ మండపాల వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండాలన్నారు. నిమజ్జనానికి సంబంధించిన రూటు మ్యాప్‌ను ముందే తెలియజేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించకూడదన్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, సీఐలు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓలు, విద్యుత్ శాఖ ఏడీ, ఏఈలు పాల్గొన్నారు.

వినాయక చవితి సందడి మొదలైంది. పల్లె, పట్టణం, వీధి, కాలనీ అన్న తేడా లేకుండా వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. బుధవారం వినాయక చవితి సందర్భంగా పలుచోట్ల చలువ పందిళ్లు వెలుస్తున్నాయి. రంగురంగుల విగ్రహాలు దర్శనమిస్తుండడంతో ఈ విగ్రహాల కొనుగోళ్లకే యువత ప్రాధాన్యత ఇస్తోంది. మరోపక్క ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో తయారైన విగ్రహాల వినియోగం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. పీఓపీ విగ్రహాలకు వాడే రంగుల రసాయనాలు భూమిలో, నీటిలో ఇంకి జలవనరులు విషపూరితం అవుతాయంటున్నారు. ఈ నీటిని తాగిన మూగజీవాలు, మనుషులు వ్యాధుల బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాని కలిగించే పీఓపీ విగ్రహాలను విడనాడి, మట్టి విగ్రహాలతో పండుగ జరుపుకొని. పర్యావరణాన్ని పరిర క్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నారు.

పీఓపీతో చేసిన వినాయక విగ్రహాలు, (ఇన్‌సెట్‌) మట్టి గణపతి ప్రతిమ



చవితి సందడి ప్రారంభం

- పీఓపీతో పర్యావరణానికి ముప్పు
- మట్టి విగ్రహాలకు పెరుగుతున్న ఆదరణ
- బహిరంగ ప్రదేశాల్లో పోలీసుల అనుమతి తప్పనిసరి



పుత్తూరు: చిన్నా పెద్దా తేడా లేకుండా సంతోషంగా జరుపుకొనే పండుగ వినాయక చవితి. వినాయకుడి వేడుకలకు విగ్రహాలు సిద్ధమయ్యాయి. గణనాథుడి వేడుకలు ఘనంగా నిర్వహించాలని యువత ఉత్సాహంతో ఉరకలేస్తుండగా, విగ్రహాల తయారీనే నమ్ముకొన్న వ్యాపారులు అమ్మకాలపై ఆశలు పెంచుకొన్నారు. 2 అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తుతో రంగు రంగుల విగ్రహాలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే విగ్రహ కేంద్రాల వద్ద నచ్చిన బొమ్మలకు కొందరు అడ్వాన్సులిస్తుండగా, మరికొందరు విగ్రహాలను తమ మండపాల వద్దకు తరలిస్తున్నారు. పుత్తూరు పట్టణ పరిధిలోని కళ్యాణపురం, ఈశలాపురం, మండల పరిధిలోని మహాలక్ష్మీపురం, కేఎంఅగ్రహారం గ్రామాల వద్ద సుమారు 70 కుటుంబాల వారు విగ్రహాలను తయారు చేసి, విక్రయిస్తున్నారు. ప్రతిఏటా ఫిబ్రవరి నెల నుంచి ఆరు నెలల పాటు విగ్రహాలు తయారు చేసి ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వచ్చే వినాయక చవితికి అమ్మకాలకు పెడుతారు. చవితి సందర్భంగా ఒక్క పుత్తూరులోనే రూ.50 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతుంది. పుత్తూరు పట్టణంలోని దాదాపు అన్ని ప్రధాన వీధుల్లో విగ్రహాల ఏర్పాట్లు జోరందుకొన్నాయి. మూడు, ఐదు, తొమ్మిది రోజులు వంతున చవితి వేడుకలు చేయడానికి ఆయా ఉత్సవ కమిటీలు పోటీపడుతున్నాయి. దీంతో పట్టణంలో చవితి సందడి ఊపందుకుంది

మట్టి గణపయ్యలే ముద్దు

పీఓపీతో కలిగే అనర్థాలపై ప్రజల్లో ఇప్పుడిప్పుడే అవగాహన కలుగుతోంది. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ పీఓపీ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రమాదాలు కలిగించే భారీ విగ్రహాల కన్నా, చిన్నవైనా మట్టి విగ్రహాలనే పూజించేందుకు యువత ముందుకొస్తోంది. దీనిపై ఏటా కుమ్మర, శాలివాహన సంఘాల వారు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నారు. దీంతో మట్టి విగ్రహాలను కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

అనుమతి తప్పనిసరి



పుత్తూరు మున్సిపల్, మండల పరిధిలో వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి. ఆయా కమిటీల సభ్యుల వివరాలు తెలపాలి. విద్యుత్, పురపాలక సంఘం, పంచాయతీల అనుమతి తీసుకోవాలి. డీజే పాటకచేరీలకు అనుమతి లేదు. రాత్రి 10 గంటలకు మైక్‌లు ఆఫ్ చేయాలి. నిమజ్జనం తేదీ, సమయం తెలియజేయాలి. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవు.

–కె.ఆర్. శేఖర్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పుత్తూరు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

పాలసముద్రం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందవని, ఆరోగ్యం బాగుంటుందని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో కలసి పరిసరాలను పరిశుభ్రం చేసే(శ్రమదానం) కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఆవరణలో ఉన్న చిన్నచిన్న పిచ్చి మొక్కలను తొలగించారు. మరుగుదొడ్ల సమీపంలో ఉన్న నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై రాచపాల్యం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ



పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేస్తున్న దాత

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ పాఠశాలకు పూర్వ విద్యార్థి వరదరాజు చెంచురాజు కంప్యూటర్‌ను వితరణ చేశారు. శనివారం ప్రధానోపాధ్యాయుడు వెంకమరాజుకు అందజేశారు. దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభివృద్ధికి సహకరించిన దాతను పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిన్నపాపయ్య, ఉపాధ్యాయులు సూరలక్ష్మి, సురేష్ పాల్గొన్నారు.

మాజీ ఉప ముఖ్యమంత్రితో నాయకులు



నారాయణస్వామి, కృపాలక్ష్మితో శ్రీరంగరాజపురం నాయకులు



కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని, వైఎస్‌ఆర్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయ కర్త కృపాలక్ష్మిని శ్రీరంగరాజపురం మండల నాయకులు శనివారం పుత్తూరులోని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, ఉమ్మడి జిల్లా పార్టీ క్రియాశీలక సభ్యులు విజయబాబు, దేవరాజులు రెడ్డి, ఎంపీటీసీ కోటిరెడ్డిబాబు, తయ్యూరు మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, సుధా, దొరస్వామి, శ్రీరంగరాజపురం మండల వైఎస్‌ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులపై కక్ష సరికాదు

గంగాధరనెల్లూరు: కూటమి ప్రభుత్వం ఆగడాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయని, దివ్యాంగుల పెన్షన్ రీవెరిఫికేషన్ కార్యక్రమంపై వైఎస్‌ఆర్ సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయ కర్త కృపాలక్ష్మి మండిపడ్డారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. అంగవైకల్యంతో ఇబ్బందులు పడుతూ కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్న వ్యక్తులకు ప్రభుత్వం అండగా నిలబడి పెన్షన్ ఇవ్వాలన్నారు. అయితే రీవెరిఫికేషన్ పేరుతో జీడీనెల్లూరు నియోజకవర్గంలో వందలాదిమంది దివ్యాంగుల పెన్షన్ తొలగింపునకు చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. అర్హులైన ఏ ఒక్కరికైనా పెన్షన్ తొలగిస్తే ఊరుకోమని, దివ్యాంగులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ కచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్‌జీఓ కార్యవర్గ అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి



శశిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎన్‌జీఓ నాయకులు

కార్వేటినగరం: పుత్తూరు తాలూకా ఏపీ ఎన్‌జీఓ కార్యవర్గం అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎనికయ్యారు. శనివారం జరిగిన కార్యవర్గ ఎంపిక కార్యక్రమంలో కార్యదర్శిగా టీకే రాజన్, ఉపాధ్యక్షుడిగా త్యాగరాజు, జాయింట్ సెక్రటరీగా మునికృష్ణను ఎన్నుకున్నారు. అలాగే కో–ఆప్షన్ అబ్జర్వర్‌గా పురుషోత్తంరెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు జిల్లా ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు కేవీ రాఘవులు, జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ప్రదీప్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పుత్తూరు తాలూకా ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడిగా ఎంపికైన శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం శశిధర్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

పోలీసులు కీలక పాత్ర పోషించాలి



పోలీసులకు సూచనలిస్తున్న న్యాయమూర్తులు

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడంలో పోలీసులు కీలక పాత్ర పోషించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి కోరారు. శనివారం కోర్టులో పోలీసులతో లోక్‌అదాలత్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ అన్ని రకాల సివిల్ కేసులు, వివాహ సంబంధ మనోవర్తి, చెక్కు బౌన్స్ కేసులు, రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. అలాగే ఫ్రీ లిటిగేషన్ కేసులు (కోర్టులో పెండింగ్‌లో లేని కేసులు) సైతం రాజీ చేస్తామని వెల్లడించారు. లోక్ అదాలత్‌లో తీర్పు అంతిమ తీర్పు అని, దీనిపై అప్పీలుకు వెళ్లడానికి అవకాశమే లేదని స్పష్టం చేశారు. పోలీసులు ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కె.రమ్యసాయి పోలీసులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో సీఐ శేఖర్ రెడ్డి, పుత్తూరు, ఎస్‌ఆర్‌పురం, వెదురుకుప్పం, వడమాలపేట మండలాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే విచారణ



మాట్లాడుతున్న మండల కన్వీనర్ మణి

శ్రీరంగరాజపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్‌ఆర్ సీపీ నాయకులే లక్ష్యంగా అక్రమ కేసులు, దాడులు, సోదాలు చేస్తున్నారని ఆ పార్టీ మండల కన్వీనర్ మణి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం పారదర్శకంగా మద్యం షాపులను నిర్వహించిందన్నారు. అవినీతి జరగని మద్యం కేసులో కుంభకోణం జరిగిందని విచారణ కోసం శుక్రవారం సిట్ బృందం మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని విచారించడం దారుణమన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంత వరకు ఒక్క రూపాయి కూడా అవినీతి చేయని వ్యక్తి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అని అన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా చివరకు గెలిచేది న్యాయమేనని అన్నారు. ఎంపీపీ సరిత జనార్ధన్, వైఎస్‌ఆర్ సీపీ నియోజకవర్గం సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మణి, మాజీ సర్పంచ్ బాబు, నాయకులు రామనాథరెడ్డి, జయ, రఘు తదితరులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి

నగరి: సురవరం సుధాకర్ రెడ్డి మృతికి స్థానిక సీపీఐ నాయకులు నివాళులర్పించారు. శనివారం బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సుధాకర్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి ఆయనకు నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను నెమరువేసుకున్నారు. ఉద్యమాల సూర్యుడిగా పేరుగాంచిన సుధాకర్‌రెడ్డి మరణం పార్టీకి తీరనిలోటని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శ వేలన్, నాయకులు బాషా, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం



తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కై ంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కన్నుల పండుగగా సాగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. తిరిగి ఆలయం చేరుకొన్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ పర్యవేక్షించారు.

సోలార్ విద్యుత్ వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఎస్‌ఈ సురేంద్రనాయుడు

పుత్తూరు: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సూర్యఘర్ సోలార్ విద్యుత్ పలకల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ పి.సురేంద్రనాయుడు కోరారు. శనివారం స్థానిక ఈఈ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలను అందజేస్తోందని తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగంతో చార్జీలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. సోలార్ ఏర్పాటుకు ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. గృహ వినియోగదారులకు మాత్రమే అందిస్తున్న ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగేటట్లు సిబ్బంది పనిచేయాలని సూచించారు. సిబ్బంది అన్నివేళలా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈఈ ఆశీర్వాదం, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్యాంశాలపై అవగాహన అవసరం

నింద్ర: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు పాఠ్యంశాలపై అవగాహన పెంచుకుని చక్కగా చదువుకోవాలని ఎంఈఓ శ్రీధర్ రాజు అన్నారు. శనివారం మండలంలోని ఆరూరు పాఠశాలను ఆయన సందర్శించారు. బోధన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల హాజరు వివరాలు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధన అంశాలపై సులభ పద్ధతిలో పిల్లలకు అవగాహన కల్పించాలని అన్నారు.

విధిగా పౌష్టికాహారం తీసుకోవాలి

నింద్ర: బాలింతలు, కిషోర బాలికలు ప్రతినిత్యం విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ శ్యామల అన్నారు. శనివారం మండలంలోని పాదిరి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, కిషోర బాలికలు ఆహారం తీసుకునే విధానాలు, పరిసరాల పరిశుభ్రత, ఆహార శుభ్రత చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొడి విత్తనాలు విత్తే పద్ధతులను పాటించాలి



పీఎండీఎస్ సాగును పరిశీలిస్తున్న అధికారులు

నగరి: వర్షాకాలం ముందే పొడి విత్తనాలు విత్తే పద్ధతులను రైతులు పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ.వాసు రైతులకు సూచించారు. శనివారం గుండ్రాజకుప్పం, రామాపురం, రాజుల కండ్రిగ గ్రామాలలో వర్షాకాలం ముందే పొడి విత్తనాలు విత్తే పద్ధతి(పీఎండీఎస్) పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా రైతులు వర్షం పడి భూమి వదులైన తర్వాత దున్ని విత్తనం వేస్తారన్నారు. అయితే పీఎండీఎస్ పద్ధతిలో రైతులు వర్షం రాకమునుపే, ఎండలు ఉన్నపుడే నేల పొడిగా ఉన్నపుడే ఘన జీవామృతం వేసి దుక్కి చేసి నవధాన్యాల విత్తనాలకు మట్టి, పేడతో లేపనం చేసి విత్తన బంతులు తయారుచేసి చల్లుతారన్నారు. ఆపై వేరుశనగ కాయల పొట్టు, కందిపొట్టు, శనగపొట్టు తదితర పంట వ్యర్థాలను రెండు, మూడు అంగుళాల మందాన వేస్తారన్నారు. ఇది గాలిలో ఉన్న తేమను ఒడిసి పట్టి ఘనజీవామృతానికి, మట్టికణాలకు అందిస్తుందన్నారు. వరి సాగులో ప్రత్యామ్నాయ తడి, ఎండబెట్టే పద్ధతితో సమర్థవంతమైన వరి సాగు అనే విధానాలపై రైతులకు వివరించారు. సంబంధిత పైపులను రైతులకు అందజేశారు. హెచ్‌ఆర్ గురు ప్రసాద్, ఎన్‌ఎఫ్‌ఏ నాంచారమ్మ, చంద్రశేఖర్, సురేష్, పుండరీకం, అమల, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలి

నగరి: వర్షాకాలంలో నివాస ప్రాంతాల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కార్యాలయం నుంచి ఓంశక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటుచేసి ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేయరాదన్నారు. డీఈఈ రవీంద్రా రెడ్డి, టీపీఓ జభీరాఖాతుమ్, మేనేజర్ శేఖర్, ఆర్ఓ తారకరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, ఆర్ఐ జయశంకర్, ఇంద్రశేఖర్, మెప్మా సీఎంఎం ప్రసాద్, పురపాలక సిబ్బంది, సచివాలయం సిబ్బంది, మెప్మా సీఓలు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు మారుపేరుగా నిలవాలి

కార్వేటినగరం: స్వచ్ఛతకు కార్వేటినగరం మారుపేరుగా నిలవాలని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కార్యాలయాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి పారిశుధ్యంలో ఆదర్శంగా నిలవాలన్నారు. అదే విధంగా సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించి, తడిపొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించే విధంగా చూడాలన్నారు. అనంతరం కార్యాలయాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. డెప్యూటీ ఎంపీడీఓ మధుసూదన్, ఈఓ నాగరత్నమ్మ, ఏపీఓ కిరణ్, ఏపీఎం కవిత పాల్గొన్నారు.

తూకం తక్కువిస్తే.. జనానికి ఎలా ఇవ్వాలి?

గంగాధరనెల్లూరు: ఒక్కొక్క డీలర్‌కు 500 కేజీలు నుండి 1000 కేజీల వరకు తూకాలు లోటుగా ఉంటే.. జనానికి బియ్యం తాము ఎలా పంపిణీ చేయాలని డీటీ మహేష్‌కు మండలంలోని రేషన్ డీలర్లు తమగోడును వెళ్లగక్కారు. గంగాధరనెల్లూరు మండల ప్రభుత్వ చౌకదుకాణాల డీలర్లకు శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ మహేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రేషన్ డీలర్లు మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ గోదాములో తూకం వేసేటప్పుడే తక్కువగా వేస్తున్నారని తెలిపారు. కొంత మంది డీలర్లకు వీఆర్ఏతో అటాచ్ చేశారన్నారు. వీఆర్ఏ వచ్చి వేలిముద్రలు వేసే వరకు రేషన్ సరుకులు కార్డుదారులకు ఇవ్వలేకపోతున్నామని, అటాచ్‌మెంట్ తొలగించాలని డిమాండ్ చేశారు. గోడౌన్ డీటీ కరుణాకర్ రెడ్డి, ఆర్ఐ ఏకాంబరం, డీలర్లు పాల్గొన్నారు.

దారికి అడ్డంగా విగ్రహం వద్దు



తడుకులో చవితి ఏర్పాట్లను అడ్డుకొంటున్న గూళూరు ప్రజలు

పుత్తూరు: రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ రోడ్డుకు అడ్డంగా వినాయకుని విగ్రహం ఏర్పాటు చేయడం సమంజసం కాదని, తక్షణం ఏర్పాట్లను నిలిపివేయాలంటూ ఎగువ గూళూరు దళితవాడ, దిగువ గూళూరు గ్రామ ప్రజలు శనివారం తడుకు గ్రామంలో ఆందోళన చేపట్టారు. గ్రామస్తులు మాట్లాడుతూ శిరుగురాజుపాళెం గ్రామం మీదుగా ఎగువ గూళూరు దళితవాడ, దిగువ గూళూరు గ్రామాలను కలుపుతూ తడుకు వరకు రింగు రోడ్డు ఉందని తెలిపారు. అయితే శిరుగురాజు పాళెం వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి మరమ్మతుల కారణంగా గత కొద్ది రోజులుగా రాకపోకలు స్తంభించాయన్నారు. దీంతో సదరు రెండు గ్రామాల ప్రజలు తడుకు గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తడుకు గ్రామంలో వినాయక చవితి పేరిట రోడ్డుకు అడ్డంగా పందిరి వేయడం ద్వారా రెండు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభిస్తాయని తెలిపారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చవితి ఏర్పాట్లు చేసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పదని గూళూరు గ్రామస్తులు హెచ్చరించారు. పోలీసులు సైతం ఇక్కడ పందిరి వేయడానికి అనుమతించే పరిస్థితి లేదని, తడుకు గ్రామస్తులు పరిస్థితిని అర్థం చేసుకొని దారి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.